సాక్షి
వరంగల్
మంగళవారం । 16 । జూలై । 2024



'కత్తెర' కాటు..

మొక్క జొన్న పంటను కత్తెర (గొంగళి) పురుగు కత్తిరిస్తోంది. ఫలితంగా ఈ పంట సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. - 8లో▸



కలెక్టర్‌కు రాసిన లేఖను అందజేయండి

హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయం భూవివాదంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. కలెక్టర్‌కు రాసిన లేఖను అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

రైతన్నకు వెన్నుదన్ను..

వ్యవసాయాన్ని ఆదుకునేలా 'రైతు భరోసా' రూపకల్పన

సన్న, చిన్నకారు రైతులకే ప్రభుత్వం చేయూత

- ఇకనుంచి అర్హులైన వారికే రైతు భరోసా పెట్టుబడి
- పథకాలు, హామీల అమలు కోసమే ప్రజాభిప్రాయ సేకరణ
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కొండా సురేఖ, సీతక్క

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ అర్బన్:

దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడైనా రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో వ్యవసాయాన్ని ఆదుకునేలా రైతు భరోసా పథకాన్ని అమలు చేసి రైతులకు అండదండగా ఉంటామని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రైతు భరోసా పథకం అమలు విధివిధానాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క, ఉపసంఘం సభ్యులైన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, తదితరులు హాజరయ్యారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీలు పోరిక బలరాంనాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, షేక్ రిజ్వాన్ బాషా, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, ఉమ్మడి జిల్లా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, నిరుద్యోగులను రెచ్చగొడుతున్న ప్రధాన ప్రతిపక్షం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రైతులను, నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం ప్రధాన ప్రతిపక్షం చేస్తోంది. ఇన్‌కం టాక్స్, పాన్‌కార్డ్ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్న దుష్ప్రచారం సరికాదు. రైతుల సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం వెనకడుగు వేయదు. రైతుల నిర్ణయాలే ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుగా పరిగణిస్తాం. పేదోడి రాజ్యం రావాలని, మంచి ప్రభుత్వం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకున్నారు. అందుకు మా ప్రభుత్వం ఏర్పడేలా ఆశీర్వదించారు. మా ప్రభుత్వం ఏర్పడే నాటికే రూ.7లక్షల కోట్ల అప్పు భారం అప్పగించారు. అయినప్పటికీ ముందుకు సాగుతూ రైతును రాజు చేసే కార్యక్రమాలను అమలు చేస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు దుర్వినియోగం: మంత్రి కొండా సురేఖ

గత ప్రభుత్వ ముఖ్యమంత్రికి రైతుబంధు విషయంలో కటాఫ్ పెట్టుకోవాలని నేను చెప్పిన విషయాన్ని వినకపోగా మిగిలిన 20 శాతం మంది రైతులకు కూడా రైతుబంధు వర్తింపజేయడంతో ప్రజాధనం దుర్వినియోగమైంది. ధరణి పోర్టల్ రాకతో ఇందిరా గాంధీ భూములు అందించిన నిరుపేదలకు అన్యాయం జరిగింది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అర్హులైన రైతులకు రైతు భరోసా ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారు. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మేలు చేసేందుకు రైతు భరోసా పథకాన్ని తీసుకువస్తున్నారు.

నిజమైన రైతులకు గతంలో అన్యాయం : మంత్రి ధనసరి సీతక్క

గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో అందించిన పథకంలో లోపాలు ఉన్నాయి. నిజమైన, కష్టపడే రైతులకు అన్యాయం జరిగింది. పేరుకే పెట్టుబడి పథకం అయినా అర్హులకు అందలేదు. అసలైన రైతులకు రైతు భరోసా అందించాలని మా ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతు భరోసా విషయంలో రైతుల అభిప్రాయమనేది ఎంతో ముఖ్యం. అందుకే జిల్లాల వారీగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకొని మంచి పాలసీని తీసుకురానున్నాం.



హనుమకొండ కలెక్టరేట్‌లో రైతుభరోసాపై జరిగిన ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ కావ్య, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యే నాగరాజు

రైతు భరోసా అమలుకు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు

- మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

రైతు భరోసా పథకాన్ని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాల మేరకు శాసనసభ సమావేశాల్లో చర్చించిన అంశాలను తీర్మానం చేయనున్నాం. ఎన్నికలకు ముందు హామీలను ప్రకటించాం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆ హామీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. వరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో రాహుల్ గాంధీ రైతులకు పలు గ్యారంటీలను ప్రకటించారు. మహిళలకు సంబంధించి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి,సబ్సిడీ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి చర్యలు మొదలుపెట్టాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తున్నాం. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించనున్నాం. సాగు కోసం రైతులకు ఒక దఫా పంట సాయాన్ని చెల్లించాం. రాష్ట్రంలోని రైతులందరి అభిప్రాయాల మేరకు ప్రజా ప్రభుత్వం రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ విషయంలో ప్రజల అభిప్రాయమే జీఓగా రాబోతుంది.

రైతు బంధులో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగొద్దనే..

- తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి

రైతుబంధులో జరిగిన అనేక అవకతవకలు రైతు భరోసా విషయంలో జరగకూడదనే ఉద్దేశంతోనే రైతుల అభిప్రాయాలను తీసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నాం. చిన్న, సన్నకారు రైతులకు ఏ విధంగా మేలు జరుగుతుందని అభిప్రాయాలు సేకరిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగితే ఎలాంటి పరిహారమూ రాకపోయేది. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంట నష్టపోతే కూడా బీమా ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. 7 నెలల క్రితం మా ప్రభుత్వం ఏర్పడింది. తెలంగాణలో అత్యంత ప్రాధాన్యం కలిగిన వ్యవసాయరంగానికి పెద్దపీట వేయాలన్న సోనియా, రాహుల్‌గాంధీ సూచనల మేరకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టులో అమలు చేయనున్నాం.

రైతులేమన్నారంటే..



హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు

రైతు భరోసా పథకంపై ఉమ్మడి జిల్లా పరిధి ఒక్కో శాసన సభా నియోజకవర్గం నుంచి ఇద్దరు చొప్పున రైతులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇతర ప్రతినిధుల నుంచి అభిప్రాయం తీసుకున్నారు. ఎక్కువ మంది 10 ఎకరాలకు సీలింగ్ ఉండేలా చూడాలని కోరారు. మరికొందరు వ్యవసాయం చేసే ప్రతీ రైతుకు, ప్రతీ ఎకరాకు ఇవ్వాలన్నారు. ఒకరిద్దరు మాత్రం ఈ పథకం వద్దని, సబ్సిడీ పనిముట్లు, మద్దతు ధర ఇస్తే చాలని చెప్పారు. రైతులు తెలిపిన సూచనల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి. వారి కోసం ప్రత్యేక చట్టం తేవాలి. రైతు భరోసా అందించాలి.
- కౌలురైతులకు పట్టాదారు భూమిపై ఎలాంటి హక్కు లేదని ప్రభుత్వం జీఓలో పేర్కొంటూ నిబంధనలు పెట్టాలి.
- కౌలు రైతుకు పెట్టుబడి సాయం ఇస్తే పట్టాదారు కౌలుకు ఇవ్వడు. భూమిని పడావు పెడతాడు.
- 5, 10 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అంటే పెద్ద రైతులు వ్యవసాయం చేయలేరు. అందరికీ రైతు భరోసా ఇవ్వాలి.
- వాణిజ్య పంటలు ఎన్ని ఎకరాల్లో వేసిన వారికైనా రైతు భరోసా అందించాలి. గుంట భూమి ఉన్నా.. ప్రభుత్వం సాయమందించాలి.
- ముఖ్యంగా కూరగాయలు, ఇతర పప్పు ధాన్యాలు పండించే రైతులను ప్రోత్సహించాలి.
- పంటలకు బీమా తప్పనిసరి చేయాలి. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి.
- అన్ని పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. సబ్సిడీపై అన్ని రకాల విత్తనాలు అందించాలి. వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇవ్వాలి.
- ప్రభుత్వ చిరుద్యోగులకూ ఇవ్వాలి. ఇన్‌కమ్ టాక్స్ పేరుతో భరోసా ఆపొద్దు.
- యువ రైతులను ప్రోత్సహించాలి. రైతు భరోసా మొదటి విడత మే నెలాఖరు, రెండో విడత అక్టోబర్ నెలాఖరులోగా ఇచ్చే ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రంలో కోతుల నివారణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలి.
- పహణీలో గతంలో మాదిరిగా కౌలు రైతు, సాగుదారు కాలం పెట్టాలని ఒక రైతు సూచించగా.. మిగతావారు తీవ్రంగా వ్యతిరేకించారు.





హాజరైన కలెక్టర్లు అద్వైత్‌కుమార్, రాహుల్‌శర్మ, రిజ్వాన్ బాషా, టీఎస్ దివాకర, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, మురళీనాయక్, యశస్విని, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, దొంతి, కడియం, రేవూరి, ఎంపీ బలరాంనాయక్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కార్పొరేషన్ల చైర్మన్లు జంగా రాఘవరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

పాకాలలో 19 ఫీట్లకు చేరిన నీటిమట్టం



ఖానాపురం: నర్సంపేట నియోజకవర్గంలోని ప్రధాన నీటి వనరుల్లో పాకాల సరస్సు ఒకటి. పాకాల ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో వరి పంటలు సాగవుతాయి. పాకాల పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. కాగా, సరస్సులో సోమవారం సాయంత్రం నాటికి 19 ఫీట్లకు నీటిమట్టం చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. సరస్సులోకి మరో మూడు ఫీట్ల నీరువస్తే ఆయకట్టు కింద రైతులు సాగు చేసే పంటలకు భరోసా కలుగుతుంది.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి



కాశీబుగ్గ సెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకొని రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రావు, వైస్ ప్రెసిడెంట్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రద్దు చేసిన వీఆర్‌ఓ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని, వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను తిరిగి రెవెన్యూ శాఖకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కాశీబుగ్గ సెంటర్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ జేఏసీ నాయకులు ఎస్.రాజయ్య, కర్రు సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టరేట్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, కమ్యుటేషన్ మినహాయింపు కాల వ్యవధిని 12 సంవత్సరాలకు కుదించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటీరియం రిలీఫ్‌ను 20 శాతానికి పెంచాలని, జూలై 2023 నుంచి పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మౌనదీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ జేఏసీ నాయకులు నాగపురి సారయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ వెంగళ్‌రెడ్డి, పెద్దూరి పెద్దన్న పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



కొలుగూరి రాధ

నల్లబెల్లి: వివాహిత అదృశ్యమైన సంఘటన నందిగామలో జరిగింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొలుగూరి పోషయ్య భార్య రాధ ప్రతిరోజూ సాయంత్రం వరంగల్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లి తెల్లవారుజామున కూరగాయలు తీసుకొచ్చి గ్రామంలో అమ్ముతూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో గత నెల 28న వరంగల్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన పోషయ్య బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా రాధ ఆచూకీ తెలియలేదు. వారం రోజుల క్రితం 8341682679 నంబర్ నుంచి ఫోన్ చేసి ఖమ్మంలో ఉన్నానని చెప్పింది. ఇంటికి రమ్మని చెప్పినా రాలేదు. ఆమెను ఈ నంబర్‌లో సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినా స్పందించడం లేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కాశీబుగ్గ సెంటర్: ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూములు ఇచ్చిన తమకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుతో ఖిలా వరంగల్, తిమ్మాపూర్, ఉర్సు, ఏనుమాముల, గొర్రెకుంట తదితర గ్రామాల రైతులు భూములు కోల్పోతున్నారని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి మంత్రులు సీతక్క, కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు.

వృద్ధ దంపతుల ఫిర్యాదుకు స్పందించిన కలెక్టర్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సమ్మక్క-మల్లయ్య

కాశీబుగ్గ సెంటర్: భూమి పంపకాల విషయంలో కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వృద్ధ దంపతులు సోమవారం కలెక్టర్ సత్యశారదాదేవిని కలిసి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన ఇరువాల సమ్మక్క-మల్లయ్య వృద్ధ దంపతులను కుమారులు భూమి పంపకాల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరించాలని జిల్లా సంక్షేమ అధికారి జి.హైమావతి, మామునూరు ఏసీపీని ఆదేశించారు. అనంతరం వారిని లార్డ్ వృద్ధాశ్రమానికి తరలించారు.

ఉద్యోగుల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రారంభం



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాశీబుగ్గ సెంటర్: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న జిల్లాస్థాయి ఉద్యోగుల బదిలీకి సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారదాదేవి కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్కెటింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్,పశుసంవర్ధక,జిల్లా పరిషత్ తదితర శాఖల్లోని జూనియర్ అసిస్టెంట్ల జిల్లా క్యాడర్‌కు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. జీఓ 80లోని మార్గదర్శకాల ప్రకారం బదిలీ చేస్తూ ఈనెల 19న బదిలీల ఆర్డర్స్ అందజేయనున్నారు.

మత్తు పదార్థాల్ని సేవించొద్దు

మామునూరు: యువత మత్తు పదార్థాల్ని సేవించి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కొంత మంది డబ్బు సంపాదన కోసం మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడుతూ యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా 8712584473కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పడిపోయిన భూగర్భ జలాలు

- గతేడాది జూన్‌లో -0.89 మీటర్లు..
- ఇప్పుడు 5.86 మీటర్ల అడుగులో నీటిమట్టం
- ఈనెలలో విస్తారంగా వర్షాలు కురిస్తేనే చెరువులు, కుంటలకు జలకళ
- మూడు రోజుల నుంచి పడుతున్న వానతో రైతుల్లో ఆనందం



సాక్షి, వరంగల్: వర్షాలు కురవాలి.. జలాశయాలు నిండాలి.. అప్పుడే భూగర్భ జలమట్టం పైకి వస్తుంది. అయితే గతేడాదితో పోల్చితే ఈసారి ఆశించిన వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటాయి. 2023 జూన్‌లో భూగర్భ జలమట్టం జిల్లాలో సగటున -0.89 మీటర్లు ఉంటే ఈ ఏడాది జూన్‌లో 5.86 మీటర్లకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత నెలలో 77.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 64.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో చాలా చోట్ల బావులు, బోర్లలో నీరు పడిపోయి రైతులకు తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగుల్లోకి నీరు వచ్చి చేరుతోంది. రానున్న రోజుల్లో ఈ వర్షాలు ఇలాగే కురిస్తేనే జలాశయాలు జలకళ సంతరించుకునే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. సరైన వర్షాలు లేక జూన్‌లో విత్తిన పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలవలేదు. వచ్చిన కొన్ని మొలకలు సైతం ఎండకు ఎండిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ విత్తనాలు కొని విత్తిన పరిస్థితి కనిపించింది. దీనికితోడు వర్షాలు సరిగా కురవకపోవడంతో బోర్లు,బావుల నీటితో పంటలను రక్షించుకున్నారు.భూగర్భ జలాలు పెరుగకపోవడంతో బోర్లు, బావుల నుంచి నీటి లభ్యత తక్కువగా ఉంది. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలసాగులో బిజీబిజీగా ఉన్నారు. ఈ వానాకాలం 1.05లక్షల ఎకరాల్లో వరి,1.28 లక్షల ఎకరాల్లో పత్తి, 15 వేల ఎకరాల్లో మిరప పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

భూగర్భ జలమట్టం వివరాలు (మీటర్లలో)

మండలం	జూన్ (2023)	జూన్ (2024)
చెన్నారావుపేట	0.41	1.41
దుగ్గొండి	0.29	4.34
గీసుకొండ	0.03	4.50
ఖానాపురం	0.00	4.07
నల్లబెల్లి	1.22	3.54
నర్సంపేట	0.33	4.33
నెక్కొండ	-0.21	4.64
పర్వతగిరి	-1.93	11.04
రాయపర్తి	-1.89	7.81
సంగెం	-0.20	4.07
వర్ధన్నపేట	-1.02	8.05
వరంగల్	0.67	2.49
ఖిలా వరంగల్	-0.85	5.61
సగటు	-0.89	5.86

పోలీసుల అదుపులో వాహనాల దొంగ!

నల్లబెల్లి: ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తిని మడికొండ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నల్లబెల్లి మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన సదరు వ్యక్తి ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామంలోని వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుడు జల్సాల కోసం దొంగిలించిన వాహనాలను రేలకుంట గ్రామానికి చెందిన పలువురి కుదువపెట్టి డబ్బులు తీసుకున్నాడు. కాగా, నిందితుడిని విచారిస్తున్న మడికొండ పోలీసులు.. రేలకుంట గ్రామానికి చేరుకొని ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ భూమికి రైతు బంధు!

- హడావుడిగా ధరణి పాస్‌బుక్‌ల రద్దు
- రికవరీ చేసేనా?

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో ప్రభుత్వానికి విక్రయించిన వ్యవసాయ భూమికి రైతుబంధు పొందినట్లు తెలిసింది. రెవెన్యూ రికార్డులోని చిన్న చిన్న తప్పిదాలతో గుట్టుగా తిరిగి ధరణి వెబ్‌సైట్ ద్వారా పాస్‌పుస్తకాలు పొందిన కొందరు రైతుబంధు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగర నడిబొడ్డున ఖిలా వరంగల్ మండలం మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్స్ పార్కు విస్తరణలో భాగంగా 2018లో మధ్యకోటలోని గుండు చెరువు సమీపాన 64నుంచి 92వరకు గల సర్వేనంబర్లలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) రైతుల నుంచి 29.29 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది. ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా వెంటనే చుట్టూ ప్రహరీ నిర్మించింది. కానీ, అధికారులు రికార్డులో ప్రభుత్వ భూమిగా ఎక్కించలేదు. దీంతో ధరణి వెబ్‌సైట్‌లో వారి పేరుతో భూమి ఉండటాన్ని పసిగట్టిన రైతులు గుట్టుగా ధరణి పాస్‌పుస్తకాలను పొంది ప్రతీ ఏడాది రైతుబంధు తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియా, వాట్సాప్‌లలో ప్రభుత్వానికి విక్రయించిన భూమికి రైతులు ధరణి పాస్‌పుస్తకాలు పొంది రైతుబంధు తీసుకుంటున్న విషయం వైరల్‌గా మారింది. అప్రమత్తమైన 'కుడా' అధికారులు వెంటనే మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి సంబంధిత రైతుల నుంచి ధరణి పాస్‌పుస్తకాలను స్వాధీన పర్చుకున్నారు.

వాటి రద్దు కోసం కలెక్టర్‌కు సిఫార్సు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కానీ, 2018 నుంచి 2023 రబీ వరకు రైతుబంధు పొందిన వారినుంచి తిరిగి సొమ్ము వెనక్కి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

కేయూ ఇంజనీరింగ్ విభాగాధిపతుల నియామకం




కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా, అలాగే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.రాధిక నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఎస్‌సీ విభాగాధిపతిగా రమణ

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమణను నియమించారు.

ఈసీఈ విభాగాధిపతిగా డాక్టర్ భిక్షా

ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ) విభాగాధిపతిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.భిక్షాను నియమించారు.

ఈఈఈ విభాగాధిపతిగా జగన్‌మోహన్‌రాజు

ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఈఈఈ) విభాగాధిపతిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా డాక్టర్ జగన్‌మోహన్ రాజును నియమించారు. వీరంతా యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలకు ఆయా విభాగాల అధిపతులుగా ఎక్కడ విధులను నిర్వర్తిస్తున్నారో అక్కడి నుంచే బాధ్యతలను నిర్వర్తిస్తారని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా నాగరాజు

కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా ఫార్మసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. రెండున్నరేళ్లుగా అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

ఈనెల 20న ఉత్తర్వులు జారీ చేయనున్న కలెక్టర్

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్, ఐజీ జ్యోతిబుద్ధ ప్రకాశ్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. జీఓ 236 ప్రకారం రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న జూనియర్ అసిస్టెంట్ నుంచి కింది స్థాయి ఉద్యోగుల బదిలీ జాబితాను కలెక్టర్‌కు అందజేయాలని ఆదేశించారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని చేస్తున్న 40 మంది జూనియర్ అసిస్టెంట్లు , ఒక టైపిస్ట్, 20 మంది అటెండర్లు , 4 షెరఫ్‌లు బదిలీ కానున్నారు. కాగా, మంగళవారం డీఐజీ సుభాషిణి, జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి.. కలెక్టర్ ప్రావీణ్యకు బదిలీ కానున్న ఉద్యోగుల జాబితా నివేదిక అందించనున్నారు. అనంతరం ఈనెల 20వ తేదీన కలెక్టర్ బదిలీల ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం.

‘కత్తెర’ కాటు..

మొక్కజొన్న పంటను కత్తిరిస్తున్న కీటకం

- పంటలో విజృంభిస్తున్న గొంగళి పురుగు
- ముందే గుర్తిస్తే తక్కువ నష్టం
- నివారణ, జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్త రాజు సూచనలు



రైతుకు కత్తెర పురుగు నివారణపై వివరిస్తున్న శాస్త్రవేత్త రాజు

ఖిలా వరంగల్: వానాకాలంలో మొక్క జొన్న పంటను కత్తెర (గొంగళి) పురుగు కత్తిరిస్తోంది. ఫలితంగా ఈ పంట సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న రైతులకు మొక్క దశలోనే కత్తెర పురుగు వెంటాడడం సమస్యగా మారుతోంది. మే నెలలో విత్తుకున్న మొక్క జొన్న పంట ఏపుగా పెరిగి కంకి, పీస్ దశకు చేరింది. ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పంటలు 20 నుంచి 40 రోజులు వయసులో ఉండగా పురుగు ఆశిస్తుండడంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అయితే రైతులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టాల బారిన పడకుండా ఉండొచ్చని మామునూరు కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త రాజు పేర్కొంటున్నారు. ఈ మేరకు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నష్ట పరిచే విధానం

మొదటి దశలో గొంగళి పురుగు ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ రంధ్రాలు చేస్తుంది. మొదటి దశ లార్వా ఆకుల చివరలో నుంచి తింటూ కత్తిరించినట్లు కనిపిస్తూ ఆకులను పూర్తిగా తింటుంది. కాండాన్ని కూడా తొలచి రంధ్రాలు చేసి మొక్క జొన్న కంకి లేత కండె భాగాన్ని కూడా తింటుంది.

మొక్కకు కత్తెర పురుగు చూపిస్తున్న శాస్త్రవేత్త



ఈ పురుగును ఎలా గుర్తించాలి?

ఈ గొంగళి పురుగు చూడడానికి పొగాకు లద్దె పురుగు మాదిరిగానే ఉన్నా ముఖంపై ‘వై’ ఆకారంలో తెల్లని చార కలిగి ఉంటుంది. గొంగళి పురుగుపై నాలుగు చుక్కలు ఉంటాయి. ఈ పురుగు రాత్రి వేళల్లో మొక్క జొన్న ఆకులు, కాండంపై గుడ్లు పెడుతుంది.

నివారణ ఇలా..

రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పురుగును నివారించొచ్చు.

1. లోతు దుక్కులు దున్నుకోవడం వల్ల పురుగు కోశస్థ దశలు నాశనమవుతాయి.
2. పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి.
3. ఎకరానికి 4–5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పురుగు ఉనికిని గమనిస్తూ ఉండాలి.
4. గుడ్ల సముదాయాలను గుర్తించి ఏరివేసి నాశనం చేయాలి.
5. కత్తెర పురుగు గుడ్లను ఆశించే ట్రైకో గ్రామ బదనికలను ఎకరానికి 20 వేల చొప్పున పొలంలో విడుదల చేయాలి.
6. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటర్ వేపనూనె లేదా 5 శాతం వేప గింజ కషాయం పిచికారీ చేయాలి.
7. తొలి దశ గొంగళి పురుగును నివారించడానికి ఎకరానికి 500 మి.లీ.రెకలనిపైరిఫాస్ లేదా 400 మి.లీ క్వినాల్ ఫాస్ మందులు మార్చిమార్చి పిచికారీ చేయాలి.
8. గొంగళి పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి. 80 గ్రాములు లేదా స్పైనోశాడ్ 45 శాతం ఎస్. సి. 60 మి.లీ. ఎకరానికి సుడులు లేదా మొవ్వు లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
9. ఎదిగిన గొంగళి పురుగు నివారణకు విషపు ఎరను 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం, 2లీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100గ్రాముల థయోడికార్బ్ మందును జోడించి సాయంత్రం వేళల్లో సుడులు/ పత్ర గుచ్ఛం/ మొవ్వులో వేయాలి
10. అవసరం మేరకు 2 నుంచి 3 సార్లు మందును మార్చిమార్చి పిచికారీ చేయాలి. ఈ పురుగు మందులు ఒకే రకానికి చెందినవి కాకుండా చూసుకోవాలి.

పాడి-పంట

కలుపు.. పంటకు ప్రమాదకారి

- ఆరుతడిలో కలుపు సమస్య
- తగ్గనున్న దిగుబడి
- నివారణకు మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్త క్రాంతికుమార్ సలహాలు, సూచనలు



క్రాంతికుమార్



మాలతి

మహబూబాబాద్ రూరల్: ప్రస్తుత వర్షాలకు రైతులు పప్పు దినుసు పంటలు పెసర, మినుము, కంది, నూనెగింజ పంటలు సోయాబీన్, వేరుశనగతో పాటు మొక్కజొన్న, శనగ, వాణిజ్య పంట పత్తి కూడా వేశారు. అయితే ఈ పంటల్లో ‘కలుపు’ రైతులను ఇబ్బందికి గురి చేయనుంది. పంట దిగుబడి తగ్గేందుకు కూడా ‘కలుపు’ సమస్య కారణమవుతుంది. ఈ నేపథ్యంలో ఆయా పంటల్లో కలుపు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్.. రైతులకు వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే.. పప్పు దినుసు పంటల్లో కలుపు సమస్య నివారణకు (పెసర, మినుము, కంది) రైతులు విత్తేముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతాన్ని ఎకరాకు 1 నుంచి 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలా చేయడం వల్ల కలుపు ఇక్కడే నివారించొచ్చు. తరువాత మొలకెత్తకముందు పెండిమిథాలిన్ 30 శాతం ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే, పైరు విత్తిన 20 రోజులకు వెడల్పు ఆకు కలుపు నివారణకు ఇమాజితాపైర్ (ఫర్స్యూట్) మందును 300 మిల్లీలీటర్లు ఎకరాకు లేదా గడ్డి జాతి కలుపు నివారణకు క్విజాలిఫాస్ ఇథైల్ (టర్గా సూపర్) 400 మిల్లీలీటర్లు లేదా ప్రొపాక్విజాఫాస్ 10 శాతం ఈసీ 200 ఎంఎల్ మందు పిచికారీ చేసుకోవాలి. కలుపు మందులు పిచికారీ చేసే సమయంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. అదే విధంగా వేరుశనగ పంటలో కూడా ఈ కలుపు మందులను వివిధ దశలలో పిచికారీ చేసుకోవాలి. విత్తిన 25 నుంచి 30 రోజులు తరువాత గొర్రుతో అంతరకృషి చేసుకోవడం ద్వారా కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చు. వాణిజ్య పంట పత్తిలో నెల రోజులకు వచ్చే లేత గడ్డి, వెడల్పు ఆకు గల కలుపు నివారణకు క్విజలోఫాస్ ఇథైల్ (టర్గాసూపర్) 400 మిల్లీలీటర్లు లేదా ప్రోపాక్విజాఫాస్ (ఎజిల్) 250 మిల్లీలీటర్లతోపాటు పైరిథయోబ్యాక్ సోడియం (హిట్ వీడ్ థీమ్/రైప్) 250 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. అలాగే పత్తిలో సమయానుకూలంగా పది రోజులకు ఒకసారి గొర్రు లేదా గుంటుకతో అంతర కృషి చేయాలి.



పెసర చేనులో పెరిగిన కలుపు



పత్తి చేనులో కలుపు తీస్తున్న కూలీలు

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

వరంగల్ చౌరస్తా: వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన వ్యవసాయం, రైతు సమస్యలపై పలు తీర్మానాలు చేసిన అనంతరం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా నేటికీ 75 శాతం మందికి ఉపాధినిస్తున్న వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకం వర్తింపజేసి వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారికి ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వం గ్యారంటీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు 75 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, కోశాధికారి సిరుల రవీందర్, ఉపాధ్యక్షుడు అంశాల్ రెడ్డి, కమిటీ సభ్యులు బరపటి రవీందర్, సోమిరెడ్డి సాంబయ్య, పేరయ్య, బుల్లయ్య ,రాజమౌళి, పైడి, అంబయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

కాజీపేట మీదుగా ముజఫర్‌పూర్-సికింద్రాబాద్ వీక్లీ

- నేటి నుంచి సర్వీసులు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–ముజఫర్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వీక్లీ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. వీక్లీ ప్రత్యేక రైలు, సమయం, సర్వీస్ వివరాలు ప్రకటించారు. ఈ నెల 16వ తేదీన సెప్టెంబర్ 26వ తేదీల్లో ముజఫర్‌పూర్–సికింద్రాబాద్ (05293) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం ఉదయం 10.45 గంటలకు ముజఫర్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 21.50 గంటలకు కాజీపేటకు చేరుకుని సికింద్రాబాద్‌కు వెళ్తుంది. అదేవిధంగా ఈ నెల 18వ తేదీ నుంచి సెప్టెంబర్ 26వ తేదీ వరకు సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ (05294) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ గురువారం ఉదయం 3.55 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి 5.55 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుని మరుసటి రోజు ముజఫర్‌పూర్‌కు 4.30 గంటలకు చేరుకుంటుంది. ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో కాజీపేట, పెద్దపలి, రామగుండం, బెల్లంపలి, కాగజ్‌నగర్, సిర్పూర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్నీ, సాత్న, ప్రయాగ్‌రాజ్, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, అరా జంక్షన్, దానాపూర్, పాటలీపుత్ర, హాజీపూర్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే గేట్‌మన్ ఆత్మహత్య



రాజు(ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో రైల్వే గేట్‌మన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వేస్టేషన్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన ద్వావర రాజు(28)కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. నిడిగొండ రైల్వేగేట్ వద్ద రాజు గేట్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతను జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై రఘునాథపల్లి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని కొద్ది దూరంలో బైక్ పార్క్ చేసి సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో రాజు తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యుల నుంచి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జనగామ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు. కాగా, మృతుడు ఆన్‌లైన్ గేమ్ కోసం అధిక శాతం వడ్డీతో అప్పు చేసి వేలాది రూపాయలు పోగుట్టుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పు ఇచ్చిన వ్యక్తులు డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు.

అభిప్రాయ సేకరణకు అనుమతించకపోవడం సిగ్గుచేటు



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్ : ‘రైతు భరోసా’ అమలుపై అభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశానికి వచ్చిన రైతు సంఘం నాయకులను అనుమతించకుండా సిగ్గుచేటని అఖిల భారత రైతు సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె కుమారస్వామి అన్నారు. రైతు భరోసా కార్యక్రమంపై విధివిధానాల రూపకల్పనకు వచ్చిన మంత్రి వర్గ ఉప సంఘానికి అభిప్రాయాలు తెలిపేందుకు వచ్చిన ఏఐకేఎఫ్, ఏఐఏడబ్ల్యూఎఫ్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో వారు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హంసారెడ్డి, కుమారస్వామి మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని వచ్చిన తమను మంత్రుల ఆదేశాలతోనే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. రైతు పక్షపాతి అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతుల పట్ల దయచూసి ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేసి భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. రైతు భరోసాకు 10 ఎకరాలలోపు కటాఫ్ పెట్టాలన్నారు. సాగు చేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచర్ల బాలరాజు, వక్కల కిషన్, దామర కొండ రమేష్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, మొగిలి శ్రీనివాసరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి బలవన్మరణం

కాశిబుగ్గ: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట– వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. నగరంలోని బీఆర్ నగర్‌కు చెందిన రుద్ర శ్రీనివాస్(42) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్.. ఐదు సంవత్సరాలుగా భార్యాపిల్లలను వదిలేసి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యం సేవిస్తూ పని చేయలేకపోతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి భార్య ఇందిరకు అప్పగించామని జీఆర్పీసీఐ నరేశ్ తెలిపారు.

పర్మనెంట్ కాకుండానే.. విరమణ

- 1986లో వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులుగా బాధ్యతలు
- ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్‌లో కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌గా సేవలు

హన్మకొండ : మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన వారిని పర్మనెంట్ చేయకుండా, ఎలాంటి లబ్ధి పొందకుండానే రిటైర్డ్ అవుతున్న వారి తీరు బాధాకరం. టీజీఎస్ ఆర్టీసీలో 1986లో వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులుగా చేరిన వీరు ప్రభుత్వాలు మారినా పర్మనెంట్‌కు నోచుకోలేదు. ఉద్యోగంలో చేరిన పదేళ్లకు ఎక్కడ తమను రెగ్యులర్ చేయాల్సి వస్తుందోనని ఔట్ సోర్సింగ్ విధానంలోకి మార్చారని టీజీఎస్ ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం క్యాజువల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మొత్తుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పర్మనెంట్ చేసేందుకు ముందడుగు పడిందని, ఇంతలోనే ఆయన స్వర్గస్తులు కావడంతో కొంత కాలయాపన జరిగింది. అనంతరం రోశయ్య ప్రభుత్వంలో వీరిని క్రమబద్ధీకరించేందుకు ఆర్టీసీ యాజమాన్యం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించింది. ఆ తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో తాము రెగ్యులర్ అవుతామనే వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 40 మంది వరకు రిటైర్డ్ అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా 51 మంది ఉద్యోగులు ఉన్నారని రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వమైన తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రతి నెల తమకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, ప్రస్తుతం 26 రోజులకు మాత్రమే ఇస్తున్న వేతనాన్ని 30 రోజులకు చెల్లించాలని తెలిపారు. కార్మిక చట్టం–1948 ప్రకారం 48 గంటల పని దినాలకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఉందని, దీనిని అమలు చేయాలని కోరారు. విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలని, వైద్యసౌకర్యం కల్పించాలని, ఐడెంటీ కార్డు ఏడాది కాలానికి జారీ చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో పూర్తిస్థాయి ప్రయాణ సౌకర్యం కల్పించాలని కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ విజ్ఞప్తి చేస్తున్నారు.

అగ్రిమెంట్ స్థలం రిజిస్ట్రేషన్..

- రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో బాధితుల ఆందోళన

కాజీపేట అర్బన్: అగ్రిమెంట్ స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ హనుమకొండ సుబేదారికి చెందిన యెలువోలు జోయెల్ ఓనిసిమస్ తన కుటుంబంతో కలిసి వరంగల్ ఆర్ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయం చేయాలని నినాదాలు చేశారు. బాధితుడు జోయెల్ఓనిసిమస్ కథనం ప్రకారం.. నగరంలోని వడ్డేపల్లి శివారు సర్వే నంబర్ 457 లోని 1200 గజాల భూమిని 2005లో కొనుగోలు నిమిత్తం రూ. 6 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నామన్నారు. ఆ స్థలంలో ప్రార్థనా మందిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో యజమాని తనకు తెలియకుండా మరొకరికి ఆ స్థలం విక్రయించాడని తెలిపారు. దీనిపై తమకు తెలియకుండా ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయొద్దని జూన్ 20వ తేదీన సబ్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు అందజేశామని తెలిపారు. అయినా సబ్ రిజిస్ట్రార్ రాజు రిజిస్ట్రేషన్ పూర్తి చేశాడన్నారు. దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న బాధితులు

నోటీసు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశా..

జోయెల్ఓనిసిమస్ ఇచ్చిన దరఖాస్తుతో మేము రిజిస్ట్రేషన్ ఆపలేమని తెలుపుతూ నోటీసు ఇచ్చా. కోర్టు ద్వారా వచ్చే లీగల్ నోటీసులతోనే మాకు రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ఉంది. లీగల్ నోటీసు కాకుండా దరఖాస్తు చేస్తే రిజిస్ట్రేషన్ ఆపలేమని సోమవారం నోటీసు జారీ చేసిన అనంతరం రిజిస్ట్రేషన్ చేశా. జోయెల్ ఓనిసిమస్ తన కుటుంబంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆందోళనకు దిగగా కాజీపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా.

– రాజు, సబ్ రిజిస్ట్రార్

కలెక్టర్‌కు రాసిన లేఖను అందజేయండి

- హనుమకొండలో బీఆర్ఎస్ పార్టీకి భూ కేటాయింపు వివాదంపై హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి హనుమకొండలో కేటాయించిన భూమికి సంబంధించి జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలెక్టర్‌కు రాసిన లేఖను తమ ముందు ఉంచాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. భూమి, తాత్కాలిక షెడ్ ఫొటోలు అందజేయడానికి సమయం కావాలని పిటిషనర్ న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. బీఆర్ఎస్‌కు హనుమకొండలో సర్వే నంబర్ 1066లో కేటాయించిన స్థలం, భవన నిర్మాణ అనుమతి పత్రాలను అందజేయాలని కాజీపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ‘గుర్తింపు పొందిన పార్టీలకు జిల్లా కేంద్రాల్లో కార్యాలయాల నిర్మాణం కోసం గజం రూ.100 చొప్పున ఎకరానికి ఎక్కువ కాకుండా భూమిని ఇవ్వాలని 2018, ఆగస్టు 16న నాటి ప్రభుత్వం జీఓ 167ను తీసుకొచ్చింది. దీని ప్రకారం రూ.4,84,000 చెల్లించి కలెక్టర్ ఉత్తర్వుల ద్వారా ఎకరం భూమిని పొందాం. పార్టీ కార్యక్రమాల కోసం చుట్టూ ప్రహరీ.. లోపల తాత్కాలిక షెడ్ నిర్మాణం చేపట్టాం. కరోనా కారణంగా శాశ్వత భవన నిర్మాణం చేపట్టలేకపోయాం. నిర్మాణం చేపట్టలేనందున బీఆర్ఎస్‌కు హనుమకొండలో కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లేఖ రాశారు. దీంతో కాజీపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జూన్ 25న నాకు నోటీసులు జారీ చేశారు. భవన నిర్మాణ అనుమతికి, భూ కేటాయింపునకు సంబంధించిన పత్రాలను 3 రోజుల్లో అందజేయాలని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిడి కారణంగానే కేంద్ర కార్యాలయంలో ఉండే పత్రాలను అందజేయడానికి కనీస సమయం కూడా ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇదే అంశంపై అభ్యంతరం తెలియజేస్తూ అధికారులకు వివరాలు అందజేశాం. శాశ్వత భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేశాం. మున్సిపల్ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉంది. డిప్యూటీ కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. అయినా అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగా తాత్కాలిక షెడ్ కూల్చివేసి, భూమిని వెనక్కి తీసుకునేందుకు అధికారులు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వండి’ అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ.రమణారావు వాదనలు వినిపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అధికారులకు లేఖలో వినతి చేసినట్లు లేదని, ఆదేశాలు ఇచ్చినట్లుగా ఉందని అభ్యంతరం తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఆ లేఖ కాపీని అందజేయాలని ఏజీ సుదర్శన్‌రెడ్డిని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఇంజక్షన్ వికటించి బాలుడి మృతి?

- సామాజిక మాధ్యమాల్లో వైరలైన ఘటన
- సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసిన టీజీఎంసీ



మణిదీప్ మృతదేహం

నెక్కొండ/ఎంజీఎం: కొందరి ఆర్ఎంపీల వైద్యానికి నిత్యం ఏదో ఒక చోట అయాయకులు బలవుతున్నారు. తాజాగా మండలంలోని ముదిగొండకు చెందిన కావటి మణిదీప్ (10) కూడా ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరలైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కావటి కోటేశ్వర్, సరిత దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు మణిదీప్ ఇటీవల కుక్క కాటుకు గురయ్యాడు. దీంతో గ్రామానికి చెందిన ఆర్ఎంపీ అశోక్.. ఈ నెల 11వ తేదీన యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేశాడు. దీంతో బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. దీనిపై సదరు ఆర్ఎంపీ.. గుట్టుచప్పుడు కాకుండా మృతుడి కుటుంబ సభ్యులతో రహస్య ఒప్పంద కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం వైరల్ కావడంతో తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) వెంటనే స్పందించి సుమోటోగా స్వీకరించింది. దీంతో వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ బృందానికి జరిగిన ఘటనపై విచారణ జరిపి నివేదిక అందించాలని చైర్మన్ మహేశ్‌కుమార్, రిజిస్ట్రార్ లాలయ్య సోమవారం ఆదేశించారు. కాగా, వరంగల్ టీజీఎంసీ సభ్యుడు శేషుమాధవ్, టీజీఎంసీ రిలేషన్ కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్, రాష్ట్ర ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌రెడ్డి, వరంగల్ ఐఎంఏ ప్రెసిడెంట్ అన్వర్‌మియా, వరంగల్ హెచ్ఆర్‌డీఏ అధ్యక్షుడు కొలిపాక వెంకటస్వామి, తానా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాకేశ్ నేతృత్వంలోని వైద్య బృందం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి విచారణ చేయనుందని ఆదేశాల్లో పేర్కొంది.

విద్యుదాఘాతంతో రైతు..



రాజు(ఫైల్)

కొత్తగూడ: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని ఎదుళ్లపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జినుకల రాజు(24) నాటు వేయడానికి తన పొలం సిద్ధం చేశాడు. ఈ క్రమంలో నీరు పారించడానికి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడం.. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబీకులకు అనుమానం వచ్చింది. దీంతో పొలం వద్దకు వెళ్లి చూడగా మోటార్ వద్ద షాక్ తగిలి మృతి చెంది ఉన్నాడు. దీంతో తల్లిదండ్రులు సింహాద్రి, నాగమల్లు గుండెలవిసేలా రోదించారు.